# సాక్షి ఒడిశా

సోమవారం । 9 । జూన్ । 2025






**మృతదేహం లభ్యం**

చిత్రకొండ జలాశయంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆస్పత్రికి తరలించారు.

- 8లో



**ట్రాన్స్‌జెండర్స్‌కు సంక్షేమ బోర్డు**

పర్లాకిమిడిలో ట్రాన్స్‌జెండర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారు. సదుపాయాలు కల్పించాలని కోరారు.

- 8లో

**గంజాయి స్వాధీనం**

రాయగడలో 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు.



- 8లో

## న్యూస్‌రీల్

### రథాల పై అంతస్తు తయారీ ప్రారంభం



రథాల పై అంతస్తు తయారీ పనులు

**భువనేశ్వర్:** పూరీ శ్రీ జగన్నాథుని యాత్ర కోసం రథాల తయారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మధ్యంతర దశలో కలప దుంగలు తయారీ శాలకు చేరడంలో కొంత మేరకు ఆలస్యం జరిగినా తర్వాత పనులు ఊపందుకున్నాయి. సాధారణంగా స్వామి స్నానోత్సవం నాటికి పూర్తి కావాల్సిన రథాల పై అంతస్తు తయారీ పనులు దాదాపు 2 రోజులు ముందుగా పూర్తి కానున్నాయి. రథ చక్రాలకు ఇరుసుల అమరిక పూర్తయిన నాటికి పై అంతస్తు పనులు ఆరంభమై ముందస్తుగా సిద్ధమయ్యాయి. ఇరుసు, చక్రాల ఆధారంగా నిర్మితం అవుతున్న పై అంతస్తు భాగంపై భారీ రథం ప్రధాన భాగం ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో దీని తయారీ అమరిక అత్యంత కీలకమని వడ్రంగి సేవకులు తెలిపారు.

### అనిమేష్ కుజుర్‌కు సీఎం అభినందనలు

**భువనేశ్వర్:** తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్ 2025లో పురుషుల 400 మీటర్ల రిలేలో ఒడిశాకు చెందిన అనిమేష్ కుజుర్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. భారత జట్టులో గుర్విందర్ సింగ్, అనిమేష్ కుజుర్, అమ్లాన్ బోర్గోహైన్ మరియు మణికంఠ హోబ్లిదార్ ఉన్నారు. భారత జట్టుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందనలు తెలిపారు. ఈ జట్టులో భాగమైన యువ ఒడిశా రన్నర్ అనిమేష్ కుజుర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

### మజ్జిగౌరి మందిరానికి పోటెత్తిన భక్తులు



ఆరుబయట చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**రాయగడ:** ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి క్యూలో వేచిఉండాల్సి వచ్చింది. అమ్మవారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టిందని భక్తులు తెలియజేశారు. అయితే వీఐపీ దర్శనం టిక్కెట్లు రూ.300 చెల్లించి దర్శనం కోసం వెళ్లిన భక్తులకు తిప్పలు తప్పలేదు. దీంతో విసుగెత్తిన భక్తులు కొంతమంది ఆరు బయటే అమ్మవారికి మొక్కుబడులు చెల్లించి ఇంటికి తిరిగి వెళ్లారు.

### రథయాత్రకు కోవిడ్ మార్గదర్శకాలు జారీ: ఆరోగ్య శాఖ

**భువనేశ్వర్:** పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతోంది. మరో వైపు రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల నమోదు క్రమంగా పుంజుకుంటోంది. కరోనా సంక్రమణ నియంత్రణపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 30కి చేరుకుంది. ప్రస్తుతం 7 మంది కోలుకోవడంతో 23 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్ పాజిటివ్ రోగులు ఇంట్లోనే చికిత్స పొందుతున్నారని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు. ఈ ఏడాది జరగనున్న రథయాత్ర కోసం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. కోవిడ్ 19 లక్షణాలతో అనారోగ్య పరిస్థితి ఉంటే రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లకుండా ఉండాలని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా ప్రజలను కోరారు.

**కోవిడ్ ఆంక్షలు**

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. అశ్వత్థి రథ యాత్రలో కోవిడ్ జాగ్రత్తల ఆచరణ, నివారణ కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. జలుబు, ఫ్లూ వంటి కోవిడ్ లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తులు, వృద్ధులు లేదా ఇతర వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు స్వామి యాత్రలో రథం లాగేందుకు అనుమతించరు. అదే విధంగా ఇతర తీవ్రమైన వ్యాధుల కారణంగా బలహీనమైన రోగ నిరోధక శక్తి ఉన్నవారిని ఉత్సవాలకు హాజరు కావద్దని కోరారు. యాత్రలో పాల్గొనదలిచే వారు మాస్కులు ధరించి తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ తెలిపింది. శుభ్రమైన తాగునీటిని ఉపయోగించాలని కోరారు. పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రత్యేక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయు) పనిచేస్తుంది. పడకల సంఖ్యను పెంచుతారు. అంబులెన్స్ సౌకర్యాలు, ఆరోగ్య అధికారులతో పాటు అన్ని అనుబంధ వైద్య, చికిత్స సరంజామా అందుబాటులో ఉంచుతారు.

# వ్యవసాయ స్వావలంబనకు గవర్నర్ పిలుపు

**భువనేశ్వర్:**

వ్యవసాయ రంగంలో లోటు అంశాలను గుర్తించి ఒడిశాను స్వయం సమృద్ధిగా మార్చేందుకు విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయం (ఓయూఏటీ), ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (ఐఎస్‌ఏఎం) సంయుక్తంగా స్థానిక ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాలను విద్యా పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరాన్ని తెలియజేశారు. తద్వారా ఎక్కువ మంది ముఖ్యంగా రైతులు వారికి అందుబాటులో ఉన్న ప్రయోజనాలను పొందగలుగుతారు. రైతులలో వ్యవస్థాపకతను పెంపొందించే మరియు ఆధునిక వ్యవసాయ వ్యాపార పద్ధతుల కోసం నైపుణ్యం ఆధారిత శిక్షణతో వారిని సన్నద్ధం చేసే సమగ్ర నమూనాను ఆవిష్కరించాలని విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కోరారు. రాష్ట్రంలో ప్రత్యేకమైన వ్యవసాయ వాతావరణ పరిస్థితులు, తీరప్రాంత మైదానాల నుంచి అటవీప్రాంత ఎత్తైన ప్రాంతాల వరకు విభిన్న వ్యవసాయ కార్యకలాపాలకు అనువైనవిగా ఉన్నాయి. రాష్ట్రంలో 50 శాతం కంటే ఎక్కువ జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ వ్యాపారం గ్రామీణ శ్రేయస్సు మరియు ఉపాధి కల్పనకు శక్తివంతమైన ఇంజిన్‌గా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. వ్యవసాయ ఉత్పాదన, విలువల జోడింపు, శీతల గిడ్డంగులు వంటి చర్యలు పసుపు, మిల్లెట్లు, మామిడి, సముద్ర చేపలు, కూరగాయలు వంటి ఎగుమతి ఆధారిత వ్యవసాయంలో అధిక సంభావ్య పంటలు, పదార్థాల ఉత్పాదనకు దోహదపడతాయి. రాష్ట్రానికి గణనీయమైన ఆర్థిక వనరుల్ని సమకూర్చి స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దేందుకు వారధిగా నిలుస్తాయన్నారు. వ్యవసాయ వ్యాపార వృద్ధికి స్థిరమైన మార్గాలను చర్చించడానికి పరిశోధకులు, విధాన రూపకర్తలు మరియు వాటాదారులు ఇక్కడ సమావేశం కావడం అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు. ఉద్యానం, మత్స్య సంపద, పాడి, మొక్కజొన్న, పప్పు దాన్యాలు వంటి రంగాల పెరుగుదల ద్వారా రాష్ట్రం జీవనాధార వ్యవసాయం నుండి మార్కెట్ ఆధారిత వ్యవసాయానికి మారుతోందని అన్నారు. గ్రేడింగ్, ప్యాకేజింగ్, పంటకోత నిర్వహణలో శిక్షణ ఇవ్వడం ద్వారా రైతులను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించాల్సిన అవసరాన్ని గవర్నర్ ప్రసంగంలో ప్రాధాన్యత కల్పించారు. క్లస్టర్ ఆధారిత నమూనాల ద్వారా ఎఫ్‌పీఓలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న ఉత్పత్తిదారులను బలోపేతం చేయాలని తెలిపారు. ఐఎస్‌ఏఎం కార్యదర్శి డాక్టర్ టి.సత్యనారాయణ్, సంబల్ పూర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బిధు భూషణ్ మిశ్రా, ఓయూఏటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రభాత్ కుమార్ రౌల్, ఓయూఏటీ వ్యవసాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ హృషీకేష్ పాత్రో ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతిథులు సదస్సు జ్ఞాపిక సంచికను ఆవిష్కరించారు.



సదస్సు జ్ఞాపిక సంచికను ఆవిష్కరించిన అతిథులు



సదస్సులో గవర్నర్ ప్రసంగం



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

## శ్రీమందిరంలో డిజిటల్ హుండీకి సన్నాహాలు



**భువనేశ్వర్:** పూరీ జగన్నాథ ఆలయానికి విరాళాల ప్రక్రియను ఆధునీకరించేందుకు అనుబంధ యంత్రాంగం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో సమర్పణ అనే డిజిటల్ హుండీ వ్యవస్థను ప్రారంభించాలని సంకల్పించింది. దేశ వ్యాప్తంగా బహుళ బ్యాంకు శాఖలలో ఈ వ్యవస్థని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదేశాల మేరకు న్యాయ శాఖ ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో పాలుపంచుకుంటుంది. ఈ సన్నాహాల్లో శ్రీ మందిరం పాలక మండలి సభ్యులు చురుకుగా పాలుపంచుకుంటున్నారు. ఆన్‌లైన్ విరాళాల ప్రక్రియను క్రమబద్ధీకరించి సరళీకృతం చేసేందుకు సమర్పణ డిజిటల్ చొరవ దోహదపడుతుందని భావిస్తున్నారు. దీని ద్వారా భక్తులు ఎక్కడి నుండైనా ఆలయానికి విరాళాలు ఇవ్వడానికి వీలు కలుగుతుంది. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో, రాష్ట్రం వెలుపల ప్రత్యేక డిజిటల్ హుండీలను ఏర్పాటు చేస్తారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఆన్‌లైన్ విరాళాలు చెల్లించేందుకు వీలు అవుతుంది.

**భక్తులకు సౌకర్యం**

డిజిటల్ హుండీలను ప్రారంభించడానికి వివిధ బ్యాంకుల చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్లతో (సీఎండీలు) చర్చలు ప్రారంభించారు. భక్తులు యూపీఐ కోడ్‌లను స్కాన్ చేసి, వారి కానుకలను నేరుగా జగన్నాథ ఆలయ ఖాతాకు చెల్లించడానికి సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ డిజిటల్ విధానం పారదర్శకతను పెంపొందించి రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉన్న భక్తులు మతపరమైన వేడుకలు మరియు ఉత్సవాలు, యాత్రలు వంటి సందర్భాల్లో విరాళాలు ఇవ్వడానికి అనుకూలమైన సౌకర్యం కల్పించడం లక్ష్యంగా పేర్కొన్నారు.

**భద్రతా సమస్యల ప్రస్తావన**

మరోవైపు కొంతమంది మాజీ బ్యాంకర్లు నకిలీ స్కానింగ్ పరికరాలను ఉపయోగించి సైబర్ స్కామ్‌లు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు, దీనితో ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చింది. సమర్పణ్ చొరవ జాతీయ, అంతర్జాతీయ భక్తులు జగన్నాథుడికి తమ విరాళాలను అందించడానికి ప్రధాన వారధిగా నిలుస్తుందని భావిస్తున్నారు. మాజీ బ్యాంకర్ల సూచన మేరకు క్యూఆర్ కోడ్‌లో కొన్ని భద్రతా చర్యలు తీసుకోవడం అనివార్యంగా పరిగణిస్తున్నారు. రాష్ట్ర న్యాయ శాఖ, సాంకేతిక సమాచార విభాగం సమన్వయంతో ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలను నిరోధించడానికి వివిధ భద్రతా చర్యలను పరిశీలిస్తున్నారు. గత మూడేళ్లలో శ్రీ మందిరానికి దాదాపు రూ. 113 కోట్ల విరాళాలు అందాయి. వాటిలో రూ. 59.67 కోట్లు బ్యాంకు డిపాజిట్ల ద్వారా జమ అయ్యాయి. ప్రతిపాదిత డిజిటల్ హుండీ వ్యవస్థ ఆన్‌లైన్ విరాళాలను గణనీయంగా ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

## సమితి ఇంజినీర్ తీరుపై సభ్యుల ధ్వజం!



సమావేశంలో కొట్‌పాడ్ సమితి సభ్యులు

**జయపురం:** జయపురం సబ్‌డివిజన్ కోట్‌పాడ్ సమితి ప్రభుత్వ ఇంజినీర్ తీరుపై సమితి సభ్యులు ధ్వజమెత్తారు. కోట్‌పాడ్ సమితి ఛతర్ల పంచాయతీ డుమాజోడి గ్రామం గులిమి వద్ద సమితి సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఇంజినీర్ సంతోష్ బాగ్‌సింగ్‌ను గత డిసెంబర్‌లో కోట్‌పాడ్ సమితి నుంచి బొరిగుమ్మ సమితికి బదిలీ చేశారని.. అయితే నేటి వరకు అతన్ని ఇక్కడ నుంచి రిలీవ్ చేయక పోవటంలో రహస్యం ఏమిటని ప్రశ్నించారు. ఇతనిపై పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నా వాటిని మాఫీ చేశారని ఆరోపించారు. బాగ్‌సింగ్ సమితి కార్యాలయంలో ఎప్పుడూ ఉండరని ఆరోపించారు. అవసరం నిమిత్తం ఫోను చేసినా ఎత్తకుండా కట్ చేస్తారన్నారు. గత నవంబర్ 25వ తేదీన ఆఫీసు ఆర్డర్ అయిన తరువాత అతడు కోట్‌పాడ్ సమితిలో ఏ బాధ్యతలు నిర్వహించటం లేదని చెబుతున్నారని.. అయితే కొన్నిసార్లు కార్యాలయానికి వస్తూ ప్రజా ప్రతినిధులు, కంట్రాక్టర్లపై అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే సునారబెలి, సువాగాం, చిత్ర, ఘుమర బాధ్యతలు నిర్వహిస్తున్న జూనియర్ ఇంజినీర్ దాస్ ఆయా గ్రామాలకు సమితి కార్యాలయానికి గాని సక్రమంగా రావటంలేదని కొందరు ఆరోపించారు. అభివద్ధి పనులు నాణ్యత హీనంగా చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. సభ్యులు సమితిలో జరుగుతున్న అక్రమాలపై చర్చించారు. సమస్యలు పరిష్కరించక పోతే ఆందోళన చేపడతామని మీడియాకు తెలిపారు. సమావేంలో సమితి ఉపాధ్యక్షులు బాబులి పాణిగ్రహి, గురునాథ్ హరిజన్, ప్రతాప్ సాహు, శుఖదేవ్ బిశార్,కాంచన బాగ్,మెలక జాయిపుల్,జగదీష్ భొత్ర, శ్రీదేవీరావు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి నిర్మాణ కార్మికుడు మృతి

**భువనేశ్వర్:** కటక్ నగరంలో నిర్మాణ దశలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి కార్మికుడు మృతి చెందాడు. స్థానిక శైలబాల మహిళా కళాశాల ప్రాంగణంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న భవనం 6వ అంతస్తు నుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. మృతుడు బీహార్‌కు చెందిన వలస కార్మికుడు. 20 ఏళ్ల సుజోయ్ కుమార్‌గా గుర్తించారు. సుజోయ్ భవన నిర్మాణంలో రాడ్లు కడుతుండగా భవనం 6వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన స్థానిక సిటీ ఆస్పత్రికి తరలించారు, అక్కడికి చేరుకునేలోపే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి తరలించారు.

## చికిత్సకు డబ్బుల్లేక..

**జయపురం:** మెరుగైన వైద్యం చేయించుకునేందుకు డబ్బుల్లేక మరో సేవాపేపరుమిల్లు కార్మికుడు మరణించినట్లు మిల్లు ప్రథమ యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ మహంతి వెల్లడించారు. మరణించిన వ్యక్తి బలభద్ర జెన అని వెల్లడించారు. నేటి వరకు 41 మంది సేవా కార్మికులు తగిన వైద్యం పొందలేక మరణించినట్లు మహంతి తెలిపారు. గత 10 నెలలుగా కార్మికులకు జీతాలు లేవని, మిల్లులో ఉత్పత్తి బందు అయిందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. మిల్లు అమ్మివేసి పునరుద్ధరణకు రెండు సార్లు రూ.200 కోట్లు అప్పు చేశారని, అయినా మిల్లు మూత పడి ఉందని, ఇది విచారకరమైన విషయమన్నారు. మరోసారి మిల్లు నడిపేందుకు పెట్టుబడి పెడుతున్న మరో సంస్థకు రుణం కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయినా కార్మికుల విషయం ఎవరూ పట్టించుకోవటంలేదని కార్మిక నేత ప్రమోద్ మహంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై త్వరలో రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించనున్నట్లు తెలిపారు.



కార్మికుని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

## బిన్నీస్‌పూర్‌లో జ్వరాలు



జ్వరంతో మంచం పట్టిన మహిళ



జ్వరంతో బాధపడుతున్న రోగులు



గ్రామంలో వైద్య బృందం

**రాయగడ:** జిల్లాలోని కొలనార సమితి గడిశెశిఖాల్ పంచాయతీలోని బిన్నీస్‌పూర్ గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. గత వారం రోజులుగా గ్రామంలో జనం తలనొప్పి, జ్వరం, కాళ్ల నొప్పులు వంటి వ్యాధులతో బాధ పడుతున్నారు. దాదాపు 50 మందికి పైగా మంచాన పడ్డారు. కొలనార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ప్రత్యేక మెడికల్ టీం గ్రామానికి చేరుకుంది. శని, ఆదివారాల్లో ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి వ్యాధితో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించింది. శనివారం 35 మందికి రక్తపరీక్షలు చేయగా ఇందులో సునాయి పెద్దింటి, విశ్వనాథ్ ముండుక, బొర్నాముండుకలకు మలేరియా సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన వైద్య శాఖ పరిస్థితి విషమించకముందే అదుపులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టింది. మలేరియా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ జ్యోత్స్నామయి రవుతొ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందం గ్రామంలో పర్యటించి గ్రామస్తులు వినియోగిస్తున్న తాగు నీటి వనరులను పరిశీలించారు. మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ఆశా కార్యకర్తలు గ్రామస్తులకు వివరించడంతో పాటు దోమతెరలను పంపిణీ చేశారు.

## ఆదివాసీల విశ్వాసానికి ప్రతీక బిరిపాణి జాతర

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఈ ఏడాది వర్షాలు ఎలా పడతాయో వెల్లడించిన పూజారులు



బిరిపాణి దేవి మందిరం వద్ద పోటెత్తిన భక్త జనం



బిరిపాణి మందిరం వద్దకు వచ్చిన వివిధ గ్రామ దేవతలు

**జయపురం:** ఆదివాసీ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. వారు జరుపుకునే పండుగలు వారి జీవన విధానంతో ముడిపడి ఉంటాయి. అలాంటి వాటిలో బిరిపాణి జాతర ఒకటి. ఈ జాతర ద్వారా వర్ష రుతువులో పడే వర్షాలపై అంచనా వేస్తారు. వర్షాలు బాగా పడతాయా, లేదా, ఈ కాలంలో ఎలాంటి పంటలు వేస్తే ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది మొదలగు విషయాలు తెలుసుకోవడానికి జయపురం సమితి గొడాపాదర్‌లో బిరిపాణి జాతర జరుపుకుంటారు. ఈ అశాస్త్రీయ నమ్మకం శతాబ్దాల కాలం నుంచి ఆదివాసీల్లో ఉంది. శాస్త్రవేత్తలు రుతుపవనాల కదలికలు, వర్ష పాత సూచనలు తెలియజేస్తూ ఉంటారు. అయితే వారు గణాంకాలు కొన్ని సమయాలలో తప్పు కావచ్చు. కాని బిరిపిణి జాతార ద్వారా ఆదివాసీ శిశాలు, దిశారీలు రుతపవనాలపై వేసే అంచనాలు తప్పవని నమ్ముతారు. వర్ష రుతువులో వర్షాల ఏవిధంగా పడతాయి, పూజారి ఏమి చేప్తాడో తెలుసుకునేందుకు ఆదివాసీ గ్రామాల నుంచి శనివారం బిరిపాణి జాతర జరిగే జయపురం సమితి గొడపోదర్ గ్రామానికి తరలి వచ్చారు. ఈ పండుగ జయపురం సమితి గొడాపాదర్ గ్రామంలో ఏటా అంగరంగవైభవంగా జరుగుతుంది. శనివారం జరిగిన బిరిపాణి జాతరకు అనేక ప్రాంతాల నుంచి వేలాదిమంది ఆదివాసీలు వారి గ్రామ దేవతల లాఠీలతో తరలివచ్చారు. ముందుగా గ్రామ నచి బొడ్డున గల బిరిపాణి దేవి మందిరంలో పూజలు చేశారు. దేవికి కోళ్ల, మేకలు, గొర్రెలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఇంటివద్ద గ్రామ దేవతల లాఠీలకు పూజలు చేయగా అచ్చట నుంచి గ్రామానికి దూరంలోని పర్వతంపైకి వెళ్లి అక్కడ ఉన్న దేవత విగ్రహాలకు పూజలు చేశారు. గ్రామ పూజారి కలుగులో చేయి పెట్టి అందులో ఉన్న నీటి మట్టాన్ని బట్టి వర్షపాతాన్ని అంచనా వేశారు. జాతరలో పాల్గొన్న భక్తులు బిలం నుంచి వచ్చే నీటిని బాటిళ్లలో పట్టుకొని తీసుకొని వెళ్లారు. అ నీటిని పొలాలలో చల్లితే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం.

**200 ఏళ్లుగా జాతర..**

200 ఏళ్లుగా ప్రసిద్ధ బిరిపాణి జాతర జరుగుతుంది. బిరిపాణి దేవి సత్యమైన తల్లి అని.. జయపురం మహారాజుల కాలం నుంచి ప్రజలు ఈ పండుగ జరుపుతున్నారని గ్రామ పంచాయతీ మందిర పూజారి వెల్లడించారు. అనాతిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం తాము ఈ పూజలు చేస్తున్నామని.. ఈ పూజ ద్వారా వర్షపాతం ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. వర్షకాలంలో అతివృష్ట, అనావృష్ట లేక సాధారణ వర్షమా అని పూజారి చెబుతారని.. అందుకు తగ్గట్టుగా పంటలు వేసుకుంటామన్నారు.



కొండపై దేవి ప్రతిమను తీసుకెళ్తున్న పూజారి



బిరిపాణి మందిరం వద్ద పూజల కోసం వేచి ఉన్న ప్రజలు



కోళ్లు బలి ఇచ్చి వస్తున్న భక్తులు

## క్లుప్తంగా

### నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళ చెక్కును ఈవోకు అందజేస్తున్న దాతలు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాలో జి.సిగడాం మండలం ఎస్పీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన తేజోమూర్తుల ఫణికుమార్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ మేరకు ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళ చెక్కును అందజేసి, ఆలయం నుంచి రశీదును పొందారు. అంతకుముందు ఆదిత్యునికి అంతరాలయం దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

### యథేచ్ఛగా ఇసుక దందా



సూదికొండకు వెళ్లేదారిలో ట్రాక్టర్ పైకి లారీ నుంచి ఇసుక దంప్ చేస్తున్న దృశ్యం

**కాశీబుగ్గ:** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పలు ప్రాంతాలకు వేలాది టిప్పర్లు, లారీలతో నిత్యం యథేచ్ఛగా ఇసుక సరఫరా జరుగుతోంది. నాయకులు ప్రాంతాల వారీగా ఒప్పందం కుదుర్చుకుని ఇసుకను ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, ఎక్సైజ్, మున్సిపల్ ఇలా అన్ని శాఖల అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉచిత ఇసుక అని చెప్పి సొమ్ము చేసుకుంటున్న తీరు బహిరంగంగా జరుగుతున్నా దీనిపై ఎవరూ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరం.

### త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాద స్థలంలో లారీ

**రణస్థలం:** మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు ముందు వెళ్తున్న లారీని వెనుకనుంచి వచ్చిన మరో లారీ ఢీకొంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేకు వేయడంతో వెనుక వస్తున్న లారీ డ్రైవర్ క్షణాల్లో అప్రమత్తమై బ్రేకు వేసినా నెమ్మదిగా ఢీకొంది. దీంతో లారీ ముందరి భాగం బాగా దెబ్బతినడంతో చాలా సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. డ్రైవర్ చిన్న, చిన్న గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జేఆర్‌పురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో ఆనందరావు మృతదేహం

**గార:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలంలోని మొదలవలస గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన రావాడ ఆనందరావు(28), అతని స్నేహితుడు దూగాన గణపతి ఇరువురు కలిసి ఫొటోలు తీసేందుకు శ్రీకూర్మం వైపు వెళ్తున్నారు. అయితే ఆదివారం సాయంత్రం కొర్లపేట జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదం చోటుచేసుకుంది. రావాడ ఆనందరావు తల విద్యుత్ స్తంభానికి తగలడంతో అక్కడే మృత్యువాత పడ్డాడు. గణపతికి గాయాలవ్వగా 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏఎస్ఐ తెలుగు చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం బాటిళ్ల పట్టివేత

**ఎచ్చెర్ల:** లావేరు మండలంలోని బుడుమూరు నుంచి కొత్తూరుపేటకు అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను లావేరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న కింతలి లక్ష్మణరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జలాశయంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**మల్కన్‌గిరి:** మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ జలాశయంలో శుక్రవారం పడవ బోల్తా పడి గల్లంతైన శంకర్ వలాసీ (38) శవమై తేలాడు. శనివారం ఉదయం నుంచి ఓడ్రాఫ్ బృందం జలాశయంలో గాలించగా ఆదివారం ఉదయం బాకులి గ్రామ సమీపంలో మృతదేహం కనిపించడంతో బయకు తీశారు. చిత్రకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**పర్లాకిమిడి:** ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ (పి.ఆర్.ఓ.), వేర్ హౌస్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడీస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.హెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సుకు ఒడిశాలోని ఏ జిల్లాకు చెందిన విద్యార్థులైనా అర్హులేనని పేర్కొన్నారు. ప్లస్‌టు, గ్రాడ్యుయేషన్ చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ, యువకులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో యూనిఫాం, కోర్స్ మెటీరియల్, ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్స్ కోర్సు విశాఖపట్నంలో ఉచిత శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కలిపిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ, డిప్లొమా, పరామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళంలో జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని తమ సంస్థలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 8008880395, 8247656581, 7005013422 ను సంప్రదించాలని కోరారు.

## ఇద్దరు వైద్యులపై చర్యలు తీసుకోవాలి

**మల్కన్‌గిరి:** మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి లాక్ష్మీనారాయణ్ దాస్‌కు బలిమెల వార్డు సభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారు. సోమవారం ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడారు. ఇక్కడ ఐదుగురు వైద్యులు పనిచేస్తున్నారన్నారు. ఇందులో ఇద్దరు వైద్యులు రోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రోగులు ఎక్కువగా జిల్లా ఆస్పత్రి, కొరాపుట్ వెళ్లిపోతున్నారన్నారు. వైద్యులు రాసిన మందుల చీటి అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న అన్ని జిల్లాల సభ్యులు



సమావేశంలో పాల్గొన్న తృతీయ లింగమార్పిడి సభ్యులు

**పర్లాకిమిడి:** ఒడిశాలో ఆదివారం భువనేశ్వర్‌లో ట్రాన్స్‌జెండర్స్ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేసరి హోటల్‌లో సమావేశం జరిగింది. గజపతి జిల్లా నుంచి ట్రాన్స్ జెండర్స్ సంఘం కార్యదర్శి జాస్మిన్ షేక్, సభ్యురాలు లిన్ను సుబుద్ధి పాల్గొన్నారు. ఒడిశా ప్రభుత్వం తరపున ట్రాన్స్‌జెండర్స్‌కు వివిధ సంక్షేమ పథకాలు, ఉపాధి, విద్య, ఉచిత వైద్యం, ఇళ్ల పట్టాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సభ్యులు అధికారులను కోరారు. దీనిపై ఒడిశా అధికారులు సానుకూల వైఖరి అవలంబించినట్టు గజపతి జిల్లా ట్రాన్స్‌జెండర్స్ కార్యదర్శి జాస్మిన్ షేక్ తెలియజేశారు.

## ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



ఆదిత్యుని దర్శనానికి బారులుతీరిన భక్తులు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం విశేషంగా భక్తులు పూజలు జరిపించుకున్నారు. జ్యేష్ఠ మాస ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయించారు. ఇక అంతరాలయంలో ప్రత్యేకంగా తులసీదళాలతో ఆదిత్యుని మూలవిరాట్టును అలంకరించి సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అనుమతించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు దర్శనాలకు క్యూలైన్లలోకి వచ్చేశారు. ఆరోగ్యం కోసం భక్తులు సూర్య నమస్కారాల పూజలు చేయించుకుంటే.. మరికొందరు భక్తులు తలనీలాలను సమర్పించుకున్నారు. ఇదిలా ఉండగా ఒక్కరోజులోనే వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,15,200, విరాళాలు, పూజల ద్వారా రూ.91,388, ప్రసాదాల విక్రయాల రూపంలో రూ.1.98 లక్షల వరకు ఆదాయం లభించిందని ఈవో భద్రాజీ తెలియజేశారు.



పూజలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు తదితరులు

### దర్శించుకున్న విజిలెన్స్ ఎస్పీ

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆయనకు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డీ–1 ఏఈ సురేష్‌కుమార్, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు షైనింగ్ అవార్డుల పంపిణీ

**శ్రీకాకుళం న్యూకాలనీ:** తాజా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట సోమవారం అవార్డులను పంపిణీ చేయనున్నారు. పదో తరగతిలో 179 మంది ఇంటర్మీడియెట్‌లో 35 మంది విద్యార్థులకు ఈ అవార్డులను పంపిణీ చేయనున్నారు. శ్రీకాకుళం 80 ఫీట్ రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి షైనింగ్‌స్టార్స్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ ఒరిజినల్, మొదటి పేజీ జిరాక్స్ కాపీతో హాజరుకావాలని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య వెల్లడించారు.

## 21 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు

**రాయగడ:** అబ్కారీ, రైల్వే పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనితో సంబంధం ఉన్న ఇద్దరి నిందితులను అరెస్టు చేశారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ముంబాయికి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు అబ్కారీ సిబ్బంది, రైల్వే పోలీసులు దాడులను నిర్వహించినట్లు అబ్కారీ శాఖ అధికారి సంతోష్ కుమార్ దళ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైమ్:** నగరంలోని పాత శ్రీకాకుళంలో ఈనెల 10వ తేదీన జరిగే పెద్దమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శ్రీకాకుళం పట్టణం, పాత శ్రీకాకుళం (మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజన వీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట, దండివీధి, దేశర్ల వీధి, నక్క వీధి)లో పండగ నేపథ్యంలో రూట్‌మ్యాప్, బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పర్యవేక్షించారు. జిల్లా పరిషత్, నక్కవీధి, సంతోషిమాత గుడి, కలెక్టర్ బంగ్లా తదితర రహదారి మార్గంలో కాలినడకన సందర్శించి భక్తుల దర్శనం, క్యూలైన్లను పర్యవేక్షించారు. సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారుల సాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఆధారంగా మున్సిపల్ అధికారుల సమన్వయంతో మంచినీటి సదుపాయాన్ని ఇరువైపులా ఏర్పాటు చేయాలన్నారు. సిరిమాను తిరిగే ముఖ్య కూడళ్లు, గుడిలోపల, క్యూలైన్ల వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండాలని, డ్రోన్ కెమెరాలు ఉపయోగించి భక్తుల రద్దీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించాలని, రహదారి మార్గాలు సులువుగా తెలుసుకునేలా సూచికా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కొంగు పట్టు.. బూరె పట్టు



జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామంలో శివాలయం పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా ఆదివారం ఆలయం శిఖరం నుంచి బూర్లు వేశారు. వాటిని మహిళలు కొంగుచాచి పట్టుకున్నారు. ఆద్యంతం ఉత్సాహంగా కార్యక్రమం చేపట్టారు. - జి.సిగడాం

## నేటి నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** యోగా ప్రోత్సాహానికి కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన యోగాంధ్రా క్యాంపెయిన్ – 2025లో భాగంగా సోమవారం నుంచి 14వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాస్థాయిలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేట్ సమీపంలోని డీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లోని వెలుగు భవన్ ప్రాంగణంలో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి జరుగుతాయి. పోటీల్లో భాగంగా ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, పోస్టర్ ప్రదర్శన, క్విజ్ తదితర అంశాలు ఉన్నాయి.

**గ్రూపుల విభజన**

వయస్సు ఆధారంగా గ్రూపులను విభజించారు. జూనియర్ గ్రూప్‌లో 10–18 సంవత్సరాలు, యువ గ్రూప్‌లో 19–35 సంవత్సరాలు, సీనియర్ గ్రూప్‌లో 35 ఏళ్ల పైబడినవారు ఉంటారు. ఈ పోటీల నిర్వహణ బాధ్యతను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కె.త్రినాథస్వామి, ఉద్యానశాఖాధికారి ఆర్వీవీ ప్రసాద్ చూస్తారు. డాక్టర్ అనిత (డీఎంహెచ్‌ఓ), డాక్టర్ కల్యాణ్ బాబు (డీసీహెచ్ఎస్), డాక్టర్ జగదీష్ (ఆయుష్ అధికారి)లు యోగా పోటీల సమగ్ర పర్యవేక్షణ కోసం నియమించారు. పోటీల సమయంలో ప్రతిరోజూ ఫలితాలను యోగాంధ్రా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## లోక బాంధవ శతకం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న మందిరం సభ్యులు

**శ్రీకాకుళం కల్చరల్:** స్థానిక ఉపనిషన్మందిరంలో పైడి హరనాథరావు రచించిన లోక బాంధవ శతకం పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ఈ శతక పద్యములను సమాజ శ్రేయస్సు కాంక్షించి రచించినట్లు పేర్కొన్నారు. ధాన్యం పండించే రైతు, మంచుకొండల్లో ప్రాణాలు పణంగా పెట్టిన సైనికుడుపై పద్యాల రచన జరిగిందన్నారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, కోమలరావు, నిష్టల నరసింహమూర్తి, బలివాడ మల్లేశ్వరరావు, గుమ్మా నగేష్, శివరాం, విశ్వనాథం కామేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పట్నాయిక్, విశ్వేశ్వరరావు, రమణ, సూరిబాబు, సరస్వతి, లక్ష్మి, విజయలక్ష్మి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘంలో రూ.3 లక్షలు గోల్‌మాల్



**సోంపేట:** మండలంలోని గొల్లూరు పంచాయతీలోని గనగాలమ్మ ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో సుమారు రూ.3 లక్షలు గోల్‌మాల్ అయినట్లు సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బారువ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రూపు సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గనగాలమ్మ గ్రూప్ సభ్యులు బారువ స్టేట్ బ్యాంక్‌లో బ్యాంక్ లింకేజి ద్వారా రూ.పదిలక్షల రుణం తీసుకున్నారు. అయితే సంఘ ఆర్గనైజర్ గజ్జి ఊర్వశి గత కొన్ని నెలలుగా సంఘ సభ్యుల వద్ద నుంచి సుమారు రూ.3 లక్షలు బ్యాంకుకు కడతానని తీసుకుని సొంత అవసరాలకు వాడుకున్నారు. ఆ డబ్బు బ్యాంకుకు కట్టలేదు. బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులను నిలదీయడంతో ఆర్గనైజర్ గోల్‌మాల్ వ్యవహారం బయటపడింది. దీంతో గనగాలమ్మ గ్రూప్ సభ్యులు గ్రామ సంఘం వీఓఏ వంకల మోహనరావును అడిగారు. దీంతో ఆర్గనైజర్‌ను బ్యాంకు లింకేజీ కట్టమని వీఓఏ చెప్పారు. అయితే డబ్బు వాడుకుని ఐదారు నెలలుగా చెల్లించకపోయినా వీఓఏ గ్రూపు సభ్యులకు తెలియజేయక పోవడం గమనార్హం. దీంతో గ్రూపు సభ్యులు బారువ పోలీసులను ఆశ్రయించారు. ఆర్గనైజర్ భర్త అధికార పార్టీ నాయకుడు కావడంతో ఓ నియోజకవర్గ నాయకుడు కేసును సద్దుమణిగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో బారువ పోలీసులు సంఘ సభ్యులను సముదాయించి గోల్‌మాల్ చేసిన నిధులు ఆర్గనైజర్ చెల్లిస్తారని హామీ ఇవ్వడంతో గ్రూప్ సభ్యులు వెనుదిరిగారు. అయితే నిధులు గోల్‌మాల్ చేసిన ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గ్రామానికి చెందిన ఇంకో సంఘంలోనూ ఇలాగే జరిగింది. విషయం బయటకు రావడంతో డబ్బు చెల్లించారు.

## కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

**అరసవల్లి:** కరోనా వ్యాధిపై జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత సూచించారు. ఈ మేరకు ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందన్నా రు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల అమ్మవారి జాతరలు, సిరిమానోత్సవాల సందర్భంగా కరోనా ముందస్తు జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించారు. ప్రజలు మాస్కులు ధరించి ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. జనసమూహంగా ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతి రుమాళ్లను వినియోగించాలని తెలిపారు. జ్వరం, అలసట, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, ఈ మేరకు జిల్లా కేంద్రాస్పత్రి, రిమ్స్, జెమ్స్ (రాగోలు) లలో ఉచి తంగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు ఇంటి నుంచి బయటకు రాకపోవడం మంచిదని సూచించారు.

## వెలగని దీపం..!




- రెండు నెలలైనా అందని దీపం– 2 సబ్సిడీ
- రెండో విడత సుమారు రూ.16,81,88,000ల బకాయిలు
- నగదు కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన దీపం పథకం ఫలితం నీరుగారుతోంది. సుమారు రెండు నెలలైనా దీపం–2 రెండో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో అమలుపై అందోళన చెందుతున్నారు. తొలి విడతలో ఈ పథకం ద్వారా అరకొరగా నగదు విడుదల చేసినా, రెండో విడత ప్రారంభం నుంచే ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. 2024 నవంబర్‌లో దీపం –2 పథ కాన్ని ప్రారంభించిన ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు స్కీమును అమలు చేసింది. మొదటి విడత కొంతవరకు నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

### ఇదీ విషయం...

జిల్లాలో అన్ని గ్యాస్ కంపెనీలకు సంబంధించి 37 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో సింగిల్, డబుల్ సిలిండర్ల కనెక్షన్లు అన్ని కలిపి 6,92,825 ఉన్నాయి. వీటిలో ప్రతినెల సుమారుగా 88 వేలుకి పైగా లబ్ధిదారులు గ్యాస్‌ను విడిపించుకుంటున్నారు. వీరందరికీ ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేయాల్సింది. మొదటి విడతగా 2024 నవంబర్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు నిర్ణయించారు. ఈ విడతలో ఐదు నెలలకు గాను జిల్లావ్యాప్తంగా 4,40,278 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకొని విడిపించుకొన్నారు. వీరిలో 4,35,035 కనెక్షన్లకు మాత్రమే నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యింది. 5,241 మంది లబ్ధిదారులకు రూ.49,78,950లు బకాయిలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఇకపోతే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరు వరకు రెండో విడత గడువును నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన నిధులు ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందలేదు. రెండో విడతకు సంబంధించి రెండు నెలలు అనగా ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో సుమారుగా 1,77,040 మంది గ్యాస్‌ను బుక్ చేసుకున్నారు. వారు ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలకు డబ్బులు చెల్లించి గ్యాస్‌ను పొందారు. అయితే వీరికి గాను ప్రస్తుతం ఉన్న గ్యాస్ సిలెండర్ ధర ప్రాప్తికి సుమారుగా రూ.16,81,88,000లు చెల్లించాల్సింది. అయితే దీనికి అతిగతీ లేకుండా పోయింది.

ఉచిత గ్యాస్ పథకంలో రెండో విడత నగదు విడుదలపై కూటమి ప్రభుత్వం కప్పగంతులు వేస్తోంది. రోజుకోమాట చెబుతూ ప్రజలను మభ్యపెడుతోంది. ఒక రోజు అన్ని డబ్బులు త్వరలో వేస్తామని చెబుతున్నారు. మరోసారి ముందుగానే లబ్ధిదారులకు డబ్బులు అందజేస్తాము, వారు ఆ డబ్బులతో సిలిండర్ విడిపించుకోవాలని చెబుతున్నారు. మరోసారి ఈ పథకం నడపడం సాధ్యం కాదని లోలోపల సమాచారం అందిస్తున్నారు. ఇలా ఈ ఉచిత గ్యాస్ పథకంపై ప్రభుత్వం రోజుకోమాట చెబుతోంది. ఈ ఉచిత సిలిండర్ పథకం ద్వారా అందజేసే నగదు జిల్లాలోని సివిల్ సప్లయ్, జాయింట్ కలెక్టర్ కంట్రోల్‌లో లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంది. తొలి విడతకు సంబంధించిన నగదు సంబంధిత గ్యాస్ (ఆయిల్) కంపెనీలకు జమ చేసింది. తొలి విడతకు సంబంధించి కొంత నగదు జమ చేయడంతో, ఆయిల్ కంపెనీలు ఆ నగదుని లబ్ధిదారులకు ఖాతాల్లో జమ చేశారు. అయితే రెండో విడతకు వచ్చేసరికి, ఈ నగదుని గ్యాస్ కంపెనీలకు ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో లబ్ధిదారులకు సబ్సిడీ నగదు అందేలా కనిపించడం లేదు.

### రోజుకోమాట...

తర్వాత రెండో విడత 2025 ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. అయితే ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు ప్రతిరోజూ బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఫిర్యాదులు బుట్టదాఖలు

దీపం పథకం ఉచిత సిలిండర్ రాయితీ నగదు అందలేదని చాలా మంది లబ్ధిదారులు పీజీఆర్ఎస్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వారి వద్ద నగదుకి సంబంధించి సమాచారం లేకపోవడం, గ్యాస్ కంపెనీలు తమ వద్ద ప్రభుత్వం నగదు లేదని స్పష్టం చేయడంతో ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### సోషల్‌మీడియాలో పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

**పాలకొండ:** భామిని మండలానికి చెందిన జామి వెంకటేష్ అనే వ్యక్తిని సోషల్‌మీడియాలో పోస్టు పెట్టినందుకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఆ వివరాలను సీఐ చంద్రమౌళి ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఇన్‌స్టా గ్రామ్‌లో రీల్ పోస్టు చేయగా దానిపై వెంకటేష్ అసభ్యంగా కామెంట్ చేసినట్లు తెలిపారు. దీనిపై జనసేన నాయకుల ఫిర్యాదు మేరకు వెంకటేష్‌ను అరెస్టు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, సోషల్‌మీడియాలో పెట్టే పోస్టులకు అడ్మిన్ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

### యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

**శృంగవరపుకోట:** మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన శానాపతి సాయికుమార్ (26) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా సాయికుమార్ తరచూ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి విపరీతంగా కడుపునొప్పిరావడంతో భరించలేక అందుబాటులో ఉన్న గడ్డిమందును తాగేశాడు. దీంతో గమనించిన తండ్రి అప్పారావు ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని కిమ్స్, అక్కడినుంచి కేజీహెచ్‌కు తరలించి చికిత్స అనంతరం బాగుందని ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం సాయికుమర్‌కు మళ్లీ విపరీతమై కడుపునొప్పి రావడంతో ఇంటివద్ద చనిపోయాడు. దీనిపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రెండు బొలెరో వ్యాన్లు ఢీ: ఒకరికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తి

**దత్తిరాజేరు:** మండలంలోని ఎస్.బూర్జవలస పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రెండు బొలెరో వ్యాన్లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై జి.రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెర్లాం మండలం కుసుమూరు నుంచి గజపతినగరం వైపు సామగ్రితో వెళ్తున్న బొలెరో వ్యాన్‌ను వెనుక నుంచి వస్తున్న మరో బొలెరో వ్యాన్ ఢీకొనడంతో తెర్లాం మండలం కుసుమూరు గ్రామానికి చెందిన బడిమిశెట్టి శ్రీను కాలికి బలమైన గాయమైనట్లు ఎస్సై తెలిపారు. గాయాలపాలైన బడిమిశెట్టి శ్రీనును 108లో ఆస్పత్రికి తరలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### సీహెచ్‌సీకి రోగుల తాకిడి



సీహెచ్‌సీ వరండాలో చికిత్సలు పొందుతున్న రోగులు

**బాడంగి:** స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రాని(సీహెచ్‌సీ)కి జ్వరం, డయేరియా రోగుల తాకిడి ఆదివారం పెరిగింది. ఆస్పత్రి నూతన భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉన్నపాటి పాత భవన ఇరుకు గదుల్లోనే వైద్యచికిత్సలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్ వార్డులో మంచాలు చాలక పోవడంతో ఆస్పత్రి వరండాలో కూడా మంచాలు, బెంచీలు వేసి రోగులకు చికిత్స చేస్తున్నారు. దీంతో ఎక్స్‌రే, గైనకాలజిస్టు, ఇన్‌పేషెంట్ వార్డులోకి డాక్టర్లు, సిబ్బంది, రోగుల ధువులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా దూరం నుంచి వచ్చిన ఓపీరోగులకు కూడా ఆస్పత్రిలో చోటుచాలక ఆరుబయట చెట్లకింద ఓపీ టికెట్ల నమోదు, ఎన్ ఓపీ బయోమెట్రిక్‌లు చేపడుతున్నారు. అత్యవసర వైద్యసేవలకోసం రిఫరల్ కేసులను తరలించేందుకు గతంలో అంబులెన్స్ సౌకర్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ వాహనం మూలకుచేరడంతో పేదరోగులు ప్రైవేట్ అంబులెన్స్‌లకు అద్దెలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

# అపూర్వ సమ్మేళనం

- అంగరంగా వైభవంగా వజ్రోత్సవం
- విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు
- పూర్వ విద్యార్థులతో కిటకిటలాడిన వీరఘట్టం హైస్కూల్ ప్రాంగణం
- గతంలో పనిచేసిన ఉపాధ్యాయులకు సత్కారం



స్థలదాత దివంగత రౌతు చిన్నంనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబసభ్యులు



కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గురజాడ విద్యా సంస్థల అధినేత స్వామినాయుడు



వజ్రోత్సవం సందర్భంగా 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

**వీరఘట్టం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 2 వేల మంది పూర్వ విద్యార్థులు ఈ సంబరానికి హాజరు కావడంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. వీరఘట్టంలోని పంచముఖ ఆంజేయస్వామి ఆలయ సెంటర్ నుంచి పూర్వ విద్యార్థులు ర్యాలీ చేపట్టి ప్రధాన రహదారి గుండా హైస్కూల్‌కు చేరుకున్నారు. ఉత్సవ కమిటీ అంచనాలకు మించి పూర్వ విద్యార్థులు రావడంతో హైస్కూల్ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. తొలుత హైస్కూల్‌కు ఐదెకరాల స్థలాన్ని ఇచ్చిన స్థలదాత దివంగత రౌతు చిన్నంనాయుడు విగ్రహాన్ని ఆయన మనుమడు హైకోర్టు న్యాయవాది రౌతు సురేష్‌కుమార్, ఆయన కుటుంబసభ్యులు ప్రతిష్ఠించారు. తర్వాత శ్రీకాకుళం గురజాడ సంస్థల అధినేత గుండ్రెడ్డి స్వామినాయుడు ప్రపంచ మల్లయోధుడు కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈ వజ్రోత్సవానికి హాజరైన మాజీ గురువులకు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవాయిద్యాలు, పూర్ణ కలశాలతో సాదర స్వాగతం పలికారు. సభా వేదికపై ఆసీనులైన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి, వజ్రోత్సవ జ్ఞాపికలను అందజేశారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

**ఇది గొప్ప కార్యక్రమం**

వజ్రోత్సవానికి హాజరైన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 52 బ్యాచ్‌లను సమన్వయం చేస్తూ ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన కమిటీ సభ్యులను అభినందించారు.

**చదువు చెప్పిన మాస్టారును గౌరవించాలి**

వీరఘట్టం హైస్కూల్‌లో జరుగుతున్న వజ్రోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పూర్వ విద్యార్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు చదువు చెప్పిన మాస్టార్లను గౌరవించడం విద్యార్థుల బాధ్యత అన్నారు.

**పాఠశాల అభివృద్ధికి విరాళాలు..**

వీరఘట్టం హైస్కూల్‌లో 1970లో చదువుకున్న దొలూరు కైలాసరావు పాఠశాల అభివృద్ధికి రూ.1 లక్ష చెక్కును ఉత్సవ కమిటీకి అందజేశారు. అలాగే మరి కొంతమంది పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. అలాగే వజ్రోత్సవం విజయవంతం చేయడంలో కృషి చేసిన 1982 బ్యాచ్‌కు చెందిన బెహరా ప్రసాద్, ఇట్లా మన్మథరావు, కోణార్క్ శ్రీనులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

**పాఠశాల అభివృద్ధికి దోహదం**

పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు నిర్వహించే ఆత్మీయ కలయికలు పాఠశాలల అభివృద్ధికి దోహదపడతాయని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి కె.రాజ్‌కుమార్ అన్నారు.ఆత్మీయ కలయికకు ఇంతమంది పూర్వ విద్యార్థులు హాజరు కావడంతో పాఠశాల చరిత్రలో ఓ సంచలనమని డీఈఓ అన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ఉపాధ్యాయులు వాన సత్యంనాయుడు, సీరపాణి, బీవీ సత్యానందం, కె.సత్యమూర్తి, నిష్టల నరసింహమూర్తి, కె.శేషమ్మ, పెంకి సుందరరావు, మాచర్ల శ్రీరాములుదొర, ఎంబీ బెనర్జీ, పొట్నూరు భరతుడు, ధర్మాన సిమ్మయ్య, అడివినాయుడు, జీఎస్ఎస్, వారాడ వేణుగోపాలరావు, యర్రా అప్పలరాజు, తెంటు రామినాయుడు తదితరులను ఉత్సవ కమిటీతో పాటు డీఈఓ ఘనంగా సత్కరించారు.

## డ్రోన్ సహాయంతో ఓపెన్ డ్రింకింగ్‌కు అడ్డుకట్ట

- వన్‌టౌన్ పీఎస్ పరిధిలో 6 కేసులు
- టూటౌన్ పరిధిలో 11 కేసుల నమోదు



పూల్‌భాగ్ కాలనీ, నందిగుడ్డిలో డ్రోన్స్ కెమెరాలతో మందుబాబులను పట్టుకున్న పోలీసులు

**విజయనగరం క్రైమ్:** విజయనగరం పోలీస్ సబ్‌డివిజన్ పరిధి విజయనగరం వన్‌టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఆదివారం ఓపెన్ డ్రింకింగ్‌కు పోలీసులు చెక్ పెట్టారు. డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగ్‌కు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. టూటౌన్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో పూల్‌భాగ్ కాలనీ నందిగుడ్డి ప్రాంతంలోను, 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కణపాక, అయ్యన్నపేట ఏరియాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై డ్రోన్స్ పంపారు. ఆయా ప్రాంతాల్లో కొంతమంది ఓపెన్ డ్రింకింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి పోలీసులు రైడ్స్ నిర్వహించారు. వన్ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై ఆరు కేసులు, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై 11 కేసులను నమోదు చేశామని ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పేకాట, ఓపెన్ డ్రింకింగ్, ట్రాఫిక్ రెగ్యులేషన్, జాతర్లు, ధర్నాల నిర్వహణలో అనుమానాస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

## రంగనాథం ఇంట ఆఫ్రికాట్ ఫ్రూట్



రంగనాథం ఇంటి పెరడులో ఆఫ్రికాట్ చెట్టు



ఇలా కాయలతో కనువిందు



ఆఫ్రికాట్ ఫ్రూట్

**రాజాం:** పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం ఇంటి పెరడులో అరుదైన ఆఫ్రికాట్ జాతి మొక్క ఫలాలు ఇస్తోంది. రంగనాథ్ కుమారుడు డాక్టర్ రవిప్రసాద్ ఈ మొక్కను కడియం నర్సరీ నుంచి తీసుకొచ్చి ఇక్కడ వేశారు. ప్రస్తుతం ఈ చెట్టు పూతకు వచ్చి ఆఫ్రికాట్ పండ్లు కాస్తోంది. యాపిల్ పండ్లను తలపించేలా ఈ పండ్లు కనిపిస్తున్నాయి. లోపల పీచుపదార్థం ఉండడంతో పాటు మధ్యలో పిక్క ఉంది. ఈ పండ్ల పూతను చుట్టుపక్కల ప్రజలు చాలా ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## సారా నియంత్రణే లక్ష్యంగా కార్డన్‌సెర్చ్



విజయనగరం క్రైమ్: 'కార్డన్ సెర్చ్' నిర్వహిస్తున్న పోలీసులు

**విజయనగరం క్రైమ్/గుర్ల:** సారా నియంత్రణే లక్ష్యంగా జిల్లా కేంద్రంతోపాటు అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 'కార్డన్ సెర్చ్' చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ప్రజల రక్షణ, భద్రత, నేరాల కట్టడితో పాటు సారా అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా చీపురుపల్లి పోలీస్‌సబ్ డివిజన్ పరిధి గుర్ల పోలీస్ స్టేషన్ పరిధి దేవుని కణపాక గ్రామంలో ఆదివారం ఉదయం 5గంటలకు చీపురుపల్లి సర్కిల్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని ఎస్పీ చెప్పారు. స్టేషన్ సీఐ శంకరరావు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామస్తుల ఇళ్లలోను, బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారన్నారు. గ్రామంలో నివాసం ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజల రక్షణకు భరోసా కల్పించేందుకు గుర్ల, గరివిడి, బుదరాయవలస ఎస్సైలు 35 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారని చెప్పారు. గ్రామంలోని అన్ని ఇళ్లలో ఆకస్మిక సోదాలు నిర్వహించి, అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలిముద్రలను ఎంఎస్‌సీడీ పరికరాలతో తనిఖీ చేశారని చెప్పారు. అదేవిధంగా వారి దగ్గర లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని ఆరు ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం గుర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. నుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో దిగ్బంధం చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 400లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశామన్నారు. ఈ ఆపరేషన్‌లో చీపురుపల్లి సీఐతో పాటు గుర్ల, గరివిడి, బుదరాయవలస ఎస్సైలు పి.నారాయణరావు, లోకేశ్వరరావు, లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా..
# కిమిడి నాగార్జున బాధ్యతల స్వీకరణ

**విజయనగరం అర్బన్:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కిమిడి నాగార్జున ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రైవేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ సీహెచ్.ఉమామహేశ్వరరావు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కిమిడి నాగార్జున మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతులకు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తానన్నారు. డీసీసీబీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన నాగార్జునకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోళ్ల లలితకుమారి, కోండ్రు మురళీమోహన్, బేబీనాయన, బొనెల విజయ్ చంద్ర, లోకం నాగమాధవి, పి.అదితి గజపతిరాజు, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, మాజీ ఎమ్మెల్యేలు భంజ్‌దేవ్, కిమిడి గణపతిరావు, డాక్టర్ కేఏనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, డీసీసీబీ సిబ్బంది అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న గొంప కృష్ణ



బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేస్తున్న కిమిడి నాగార్జున

**డీసీఎంఎస్ సేవలను విస్తృతం చేస్తా**

**విజయనగరం ఫోర్ట్:** జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ సేవలను విస్తృతం చేయడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చైర్మన్ గొంప కృష్ణ అన్నారు. స్థానిక సంఘంకార్యాలయంలో ఆదివారం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ప్రభుత్వం నుంచి లభించే గౌరవ వేతనం. ఇతర అలివెన్స్‌లు తీసుకోబోనని, ఆ డబ్బును డీసీఎంఎస్ బలోపేతం చేసేందుకు వినియోగిస్తానని ప్రకటించారు. డీసీఎంఎస్ ఫలాలను అందరికీ అందించేందుకు సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. సంఘం ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తానన్నారు. సేవలను మరింత ఎక్కువ మందికి అందిస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన కృష్ణను మంత్రులు సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, పి. అదితి గజపతిరాజు, బొనెల విజయచంద్ర, కోళ్ల లలితకుమారిలు అభినందించారు.

### లోహ జగత్తు పుస్తకావిష్కరణ



లోహ జగత్తు పుస్తకావిష్కరణ చేస్తున్న చాగంటి తులసి, తదితరులు

**విజయనగరం టౌన్:** మానవ శరీరం అనేక లోహ మూలకాల సమూహం. ఆయా లోహాలు శరీరం ఎదుగుదల, క్షీణతలపై ఏ విధంగా ప్రభావితం చేస్తాయి 'లోహ జగత్తు' పుస్తకంలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వివరించినట్లు ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక అయ్యన్నపేట పాల్‌నగర్‌లో ఉన్న చాగంటి తులసి స్వగృహంలో తన సోదరి చాగంటి కృష్ణకుమారి రచించిన లోహ జగత్తు పుస్తకావిష్కరణ ఆదివారం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సుమనస్పతి రెడ్డి మాట్లాడుతూ తెలుగులో సరళమైన భాషలో లోహ జగత్తు పుస్తకం కథాకథనంలో ప్రజలకు అందుబాటులో రావడం వల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం సముపార్జనకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు ఎంవీఆర్.కృష్ణాజీ మాట్లాడుతూ ప్రపంచ నాగరికత వెనుక లోహ మూలకాలు, మనిషి జీవితంలో లోహాల వినియోగం సైన్స్ అభివృద్ధి సమాజంపై ప్రభావం చూపిందన్నారు. లోహ జగత్తు పుస్తకం కథా కథనం వెలువరించడం వెనుక తన తండ్రి చా.సోకు ఆమె ఇచ్చిన మాట ఉందన్నారు. జీవనంలో లోహాలు, నానోటెక్నాలజీ ఎలా ఉపయోగిస్తున్నారు? సైన్స్ అంటే భయాలు లేకుండా పోతాయని వివరించారు. లోహ జగత్తు పుస్తకం కథాకథనానికి అనుగుణంగా చిత్రాలు వేయడంతో లోహాల ప్రయోజనం తెలుసుకోవడం సులభతరమైందని చిత్రకారిణి కె.మధురశ్రీ అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్. మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ లలితకుమారి, చిత్రకారుడు చా.సో కుమారుడు చాగంటి బాపిరాజు, చాసో అభిమానులు, వర్ధమాన రచయితలు, సాహితీ స్రవంతి నిర్వాహకుడు చీకటిదివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యా యత్నం



బాధిత మహిళను 108లో ఎస్.కోట తరలిస్తున్న దృశ్యం

**వేపాడ:** మండలంలోని వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా రోడ్డుపై పెట్రోలు పోసుకుని ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా చంచలనం రేకెత్తించింది. ఇందుకు సంబంధించి వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట మండలంలోని కాపు సోంపురానికి చెందిన రొంగలి లక్ష్మి కొంత కాలంగా భర్తకు దూరంగా తన ఇద్దరు పిల్లలతో ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు కొంత కాలం క్రితం వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన ప్రస్తుతం వల్లంపూడిలో నివాసముంటున్న యోగుల కాశీతో పరిచయం ఏర్పడింది. కాశీ తన భార్య. ఇద్దరు పిల్లలతో వల్లంపూడిలో నివాసముంటున్నాడు. రొంగలి లక్ష్మి, కాశీల మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. అయితే కొంతకాలంగా లక్ష్మి వద్దకు కాశీ వెళ్లకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆదివారం వల్లంపూడి పోలీసులు కాశీతో పాటు లక్ష్మిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామపెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరం పొరపాటు చేశామని ఇద్దరికీ పిల్లలు ఉన్నందున ఇకపై ఎవరి బతుకులు వారు బతుకుదామంటూ కాశీ నచ్చచెప్పే ప్రయత్నం లక్ష్మికి చేశాడు. దీంతో కలత చెందిన ఆమె తనను నమ్మించి కాశీ మోసం చేశాడని ఈ జీవితం తనకు అవసరం లేదంటూ స్టేషన్ బయటకు పరుగెత్తి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. ఈ హఠాత్పరిణామంతో నివ్వెరపోయిన పోలీసులు, స్థానికులు హుటాహుటిన ఆమె శరీరంపై రగ్గు కప్పి లక్ష్మిని కాపాడి 108 వాహనంలో ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని, లక్ష్మి ఇచ్చిన వాగ్మూలంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.

### ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న చిన్నారులు

**రాజాం:** పట్టణంలోని తెలగవీధి శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కోలాటం కార్యక్రమం ఆకట్టుకుంది. రాజాం పట్టణానికి చెందిన ఎస్ఎస్ఆర్ బాలసంస్కార్ కేంద్రం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగా కోలాటం ప్రదర్శనతో అలరించారు. పలు భక్తిగీతాలకు లయబద్ధంగా కోలాటం ఆడుతూ ప్రేక్షకులను అలరించారు. శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### సువర్ణముఖి నది ఒడ్డున ఏనుగుల సంచారం



**సీతానగరం:** మండలంలోని లక్ష్మీపురం - ఏగోటివలస గ్రామాల మధ్యనున్న సువర్ణముఖి నది ఒడ్డున తోటల్లో ఏనుగులు ఆదివారం సంచరిస్తూ కనిపించాయి. శనివారం వెంకటాపురం - బూర్జ తోటల్లో సంచరించిన ఏనుగుల గుంపు ఆదివారం ఉదయానికి లక్ష్మీపురం పురవీధుల్లో కనిపించాయి. ఉదయం 10 గంటల తరువాత నది ఒడ్డుకు చేరాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా గడిచిన మూడు రోజులుగా మండలంలోనే ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. మరోవైపు పంట పొలాల వైపు సంచరించే సమయంలో తమ పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్



విజయనగరం రైల్వేస్టేషన్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ దళాలు

**విజయనగరం క్రైమ్:** ఆర్‌పీఎఫ్ డీజీ ఆదేశాలతో విశాఖపట్నం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో విజయనగరం రైల్వేస్టేషన్‌లో ఆదివారం కార్డన్ సెర్చ్ జరిగింది. ఈ మేరకు విజయనగరం జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు, ఆర్‌పీఎఫ్ సీఐ కుమార్, ఎస్సై శ్రీధర్‌లతో పాటు 30 మంది సిబ్బంది ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా, ఇతర మత్తుపదార్థాల రవాణాను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. మూడు బృందాలుగా ఏర్పడి విజయనగరం రైల్వే స్టేషన్‌లోని అన్ని విశ్రాంతి గదులతో పాటు క్లాక్ రూమ్‌లు, పార్సిల్ ఆఫీస్ వద్ద సోదాలు నిర్వహించారు. అలాగే స్టేషన్‌లో ఉన్న 5 ప్లాట్‌ఫారాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. స్టేషన్‌కు వచ్చిన భువనేశ్వర్-బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్, సమతా ఎక్స్‌ప్రెస్ రైళ్లను స్టేషన్ మేనేజర్ ఆదేశాలతో ప్రతి కంపార్టుమెంట్‌లోనూ సోదాలు చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఏ విధమైన మత్తుపదార్థాలు కానీ, గంజాయి సరఫరా కానీ జరగలేదని జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు తెలిపారు. ఈ తనిఖీల్లో పీసీలు రామకృష్ణ, సత్యనారాయణ, నారాయణలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతున్న తైక్వాండో క్రీడాకారులు

**బొబ్బిలి:** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్ జూనియర్ విభాగంలో ఎన్.హర్షిత, బి వరలక్ష్మి, క్యాడెట్ విభాగంలో బి.భరద్వాజ్, జూనియర్ విభాగంలో బి గౌతమి, పి.సంజన, సోమేష్ యాదవ్, బి.శివ రామకృష్ణ, సీనియర్స్ విభాగంలో కె.అభినవ్, వై.కిశోర్ కుమార్, బి.రోహిత్, ఎస్.కిరణ్‌లు తాడిపత్రిలో పోటీలకు హాజరవుతున్నారన్నారు. వారంతా గత నెల 31న బొబ్బిలిలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ముందు నిలిచారన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న రాజగోపాల్

**బొబ్బిలి:** ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక పనిచేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జేవీవీ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జేవీవీ రాష్ట్ర మహాసభలను సెప్టెంబర్‌లో విజయనగరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా విజ్ఞాన మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆర్థిక వనరుల సమీకరణ అంశాలపై సభ్యులతో చర్చించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్, ఉపాధ్యక్షుడు సత్యం నాయుడు,శివానంద్ పాల్గొన్నారు.